

నాసిరకం విత్తు.. నమ్మితే చిత్తు...!

ముందుగానే తొలకరి పలకరించింది. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దుక్కులు దున్ని విత్తనాలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మట్టిలో చిందించే స్వేదానికి దిగుబడి రూపంలో ఫలితం దక్కాలంటే 'విత్తనం' ఎంపికలో అన్నదాతలు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. తక్కువ ధరకు వస్తాయనో.. ఉద్దర (అరువు) ఇస్తారనో నాసిరకం, నకిలీ విత్తనాలను నమ్ముకుంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. తెలంగాణ రాష్ట్రం భూత్‌పుర్ నుంచి ఇప్పటికే అనుమతి లేని బీటీ-2 పత్తి విత్తనాలు ఉమ్మడి జిల్లాలో పలు గ్రామాలకు చేర్చి, రహస్యంగా అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. అరికట్టడం, వాటివల్ల కలిగే నష్టంపై రైతుల్లో అవగాహన కల్పించడంలో వ్యవసాయ యంత్రాంగం వైఫల్యం చెందిందనే ఆరోపణలు లేకపోలేదు. 2025 ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో దాదాపు 3.25 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేస్తారని అంచనా. వ్యవసాయ యంత్రాంగం అప్రమత్తమవ్వాలి. రైతులను ముంచేసే నాసిరకం పత్తి విత్తనాలు జిల్లాకు రాకుండా సరిహద్దుల్లోనే అడ్డుకోవాలి. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- ఉమ్మడి జిల్లాలో జోరుగా బీటీ-2 నాసిరకం పత్తి విత్తనాలు విక్రయం
- తెలంగాణ రాష్ట్రం భూతపూర్ నుంచి సరఫరా
- తక్కువ ధర పేరిట మోసపోతున్న అన్నదాతలు
- యంత్రాంగం అప్రమత్తమైతేనే కష్టజీవులకు మేలు
- రైతుల్లో అవగాహన కల్పించడంలో వ్యవసాయాధికారులు విఫలం

కర్నూలు, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి ఉత్పత్తిలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలు మూడో స్థానంలో ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో కర్నూలు జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 4.19 లక్షల హెక్టార్లు. నంద్యాల జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 2.36 లక్షల హెక్టార్లు ఉమ్మడి జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 6.55 లక్షల హెక్టార్లలో పత్తి, వరి ధాన్యం, మిరప, కంది, మినుము.. వంటి పంటలు సాగు చేస్తున్నారు. అగ్రస్థానం బీటీ-2 పత్తి సాగు చేస్తున్నట్లు అంచనా. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో 3.25 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేస్తారని అంచనా. ఒక్క కర్నూలు జిల్లాలోనే 2.25 లక్షల హెక్టార్లలో సాగు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. ఎకరాలకు 3 విత్తన ప్యాకెట్లు (హెక్టారుకు 7-8 ప్యాకెట్లు) పత్తి విత్తనాలు భూమిలో వేస్తారు. కొందరు రైతులైతే ఎకరాకు 4-5 ప్యాకెట్లు నాటుతున్నారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాకు 25-30 లక్షలు పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం అవుతాయని అంచనా. కర్నూలు జిల్లాలో 17-20 లక్షలు అవసరమైతే.. అందుబాటులో ఉన్నది కేవలం 15 లక్షలు ప్యాకెట్లే.

పెరిగిన ధర.. రైతుపై భారం

బీటీ-2 పత్తి విత్తనాల కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం పెంచింది. గతేడాది 475 గ్రాములు (450 గ్రాములు బీటీ రకం, 25 గ్రాములు నాన్ బీటీ రకం) విత్తన ప్యాకెట్ కనీస మద్దతు ధర రూ.863 ఉండేది. ఈ ఏడాది రూ.901లకు పెంచారు. ఒక్కో ప్యాకెట్‌పైన రూ.38 పెరిగింది. ఉమ్మడి జిల్లాలో సరాసరి 25-30 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరమని



అంచనా. ఈ లెక్కన రూ.9.50 కోట్ల నుంచి రూ.11.50 కోట్లు పత్తి సాగు రైతులపై అదనపు భారం తప్పడం లేదు. అయితే.. 2023 ఖరీఫ్‌లో ఎకరాకు 6-8 క్వింటాళ్ల దిగుబడి వస్తే.. 2024 ఖరీఫ్‌లో 8-12 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అదే క్రమంలో విత్తనోత్పత్తి దిగుబడి కూడా పెరగడం వల్ల వివిధ కాటన్ సీడ్ కంపెనీలు డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయడంతో ఎమ్మార్పీ కంటే తక్కువ ధరకు గ్రేడ్-1 కంపెనీలు పత్తి విత్తన ప్యాకెట్ ఒకటి రూ.750 - 850లకు, గ్రేడ్-2 కంపెనీల విత్తన ప్యాకెట్ రూ.650 - 750లకే విక్రయిస్తున్నామని ఆదోనికి చెందిన ప్రముఖ విత్తన వ్యాపారి ఒకరు పేర్కొన్నారు. గతేడాది డిమాండ్ ఉన్న ప్రముఖ కంపెనీల పత్తి విత్తనం నల్లబజారులో ఒక్కో ప్యాకెట్ రూ.1,200 నుంచి 1,400లకు విక్రయించిన మాట నిజమేనని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, రైతులు అనాథరైజ్డ్ విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోవద్దని ఆ వ్యాపారి సూచిస్తున్నారు.

భూత్‌పుర్ టు కర్నూలు

తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా భూత్‌పుర్ అనుమతి లేని, నాసికరం బీటీ-2 పత్తి విత్తనాలకు అడ్డాగా మారింది. భూత్‌పుర్ నుంచి కర్నూలు మండలం పంచలింగాల చెక్‌పోస్టు మీదుగా కర్నూలు, పాణ్యం, కోడుమూరు, డోన్ నియోజకవర్గాలకు, నందవరం మండలం నాగులదిన్నె చెక్‌పోస్టు దాటించి ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాలకు, మంత్రాలయం మండలం మాధవరం చెక్‌పోస్టు దాటి మంత్రాలయం, ఆదోని, ఆలూరు నియోజకవర్గాలు, అలంపూర్ మండలం రాలంపాడు దగ్గర తుంగభద్ర నదిపై వంతెన దాటి నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం, నంద్యాల, బనగానపల్లె నియోజకవర్గాలకు నాసికరం పత్తి విత్తనాలు చేరవేస్తున్నట్లు సమాచారం. కోసిగి మండలానికి చెందిన ఓ బడా విత్తన వ్యాపారి (సెటిలర్) ఒకరు కర్ణాటక రాష్ట్రం రాయచూరును అడ్డాగా మార్చుకొని అక్రమంగా విత్తన వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం. అక్కడి నుంచి జిల్లాకు ప్రభుత్వ అనుమతుల పేరిట నాసికరం విత్తనాలు చేరవేస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే భూత్‌పుర్, రాయచూరు నుంచి లక్షల బీటీ-2 పత్తి విత్తనాలు ఉమ్మడి జిల్లాలోని ఆయాగా గ్రామాల్లో రహస్య ప్రాంతాలకు చేర్చినట్లు సమాచారం. వ్యవసాయ, విజిలెన్స్ నిఘా యంత్రాంగం అప్రమత్తమై సరిహద్దులు దాటి రహస్యంగా జిల్లాకు చేరుతున్న నకిలీ, నాసికరం పత్తి విత్తనాలకు కళ్లెం వేయాలని పలువురు కోరుతున్నారు. ఆదోని పట్టణం ఆస్పత్రి రోడ్డులో జైన్ టెంపుల్ వీధిలో పెద్దఎత్తున నాసిరకం పత్తి విత్తనాలు విక్రయిస్తున్నా.. సంబంధిత అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



జిల్లాలో గతంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బీటీ-2 పత్తి నాసిరకం విత్తనాల ప్యాకెట్లు (ఫైల్)

మిగతా 5వ పేజీలో

సైనికుల త్యాగాలు మరువలేనివి

పాక్‌కు అర్థమయ్యేలా జవాబు ఇచ్చిన భారత్

- ఎంపీ బైరెడ్డి శబరి, కలెక్టర్ రాజకుమారి
- నంద్యాలలో తిరంగా ర్యాలీ
- సైనికులు, మాజీ సైనికులకు సన్మానం



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎంపీ, కలెక్టర్

నంద్యాల కల్చరల్, మే 18(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం సైనికులు చేసిన త్యాగాలు మరువలేనివని ఎంపీ బైరెడ్డి శబరి, కలెక్టర్ రాజకుమారి అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని టెక్కె మార్కెట్‌యార్డు నుంచి గాంధీచౌక్ వరకు భారీగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవం సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. తిరంగా ర్యాలీలో పాల్గొన్న ప్రతిఒక్కరికీ ధన్య వాదాలు తెలిపారు. ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్‌కు అర్థమయ్యేలా 'ఆపరేషన్ సిందూర్'తో భారత్ జవాబు చెప్పిందన్నారు. ఉగ్రవాదులకు భూమి మీద బతికే అర్హత లేదన్నారు. ఉత్సాహంగా సాగిన ఈ ర్యాలీ గాంధీచౌక్ చేరుకొని మహాత్మాగాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో కలెక్టర్ రాజకుమారి, ఎంపీ శబరి అమరజవాన్ మురళీనాయక్‌కు, పహల్గాం మృతులకు సంతాపం తెలిపారు. అనంతరం సైనికులను, మాజీ సైనికులను సన్మానించారు. ఈ తిరంగా ర్యాలీలో మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, డాక్టర్ రామక్రిష్ణారెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు ముస్తాక్ అహమ్మద్, టీడీపీ యువనేత ఫిరోజ్, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, మాజీ సైనికులు, సైనిక కుటుంబాలు, బార్ అసోసియేషన్, నంద్యాల వైద్యుల సంఘం, ప్రైవేటు విద్యాసంస్థల అధినేతలు, ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యార్థి, మహిళా, పలు సంఘాల ప్రతినిధులు, ఎన్‌సీసీ విద్యార్థులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



తిరంగా యాత్రలో భాగంగా నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులు, పలు సంఘాల ప్రతినిధులు, అధికారులు

పార్టీకి కార్యకర్తలే బలం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్
- యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాం
- టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి
- కార్యకర్తల కృషితోనే ఎమ్మెల్యే అయ్యాను
- గిత్తా జయసూర్య



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నందికొట్కూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే బలమని నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ అన్నారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలోని ఎన్.ఎస్.ఫంక్షన్ హాలులో నియోజకవర్గ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తాజయసూర్య, నియోజకవర్గ పరిశీలకులు దేవళ్ల మురళి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, ఆయా మండలాల కన్వీనర్లు, టీడీపీ నాయకులు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించి పలు అభివృద్ధి కార్యక్రమా లు చేపట్టాలని తీర్మానించారు. వాటిని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్క రించేందుకు కృషిచేస్తామని జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ సామాన్య కార్యకర్తలకు పట్టం కట్టే పార్టీ టీడీపీ అని ఆయన అన్నారు. నందికొట్కూరు నియోజ కవర్గం వ్యవసాయాధారితమైనదని, రైతులకు సాగునీరు అందించేందుకు పెద్దపీట వేయాలన్నారు. ఆతర్వాత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిం చాలని ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు మాండ్ర తెలిపారు. మిడ్తూరు మండలంలో ఎత్తిపోతల పథకం ఏర్పాటుచేసి ఆ మండలానికి సాగునీరు అందిస్తామని, తంగడంచ వద్ద జైన్ ఇరిగేషన్, తదితర సంస్థలను తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందన్నారు. కష్టకాలాలో పార్టీకి అండగా నిలబడిన వారికే పదవులు దక్కుతాయన్నారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, ముర్తుజావలి, షకీల్ అహ్మద్, లాయర్ జాకీర్, హరినాథ్‌రెడ్డి, వేణుగోపాల్, వనజ, తదితరులు పాల్గొన్నారు.

సామాన్య కార్యకర్తను ఎమ్మెల్యే చేసిన ఘనత..

నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తల కృషితోనే ఎమ్మెల్యేను అయ్యానని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. అతి సామాన్య కార్యకర్తను అయిన తనను ఎమ్మెల్యేగా చేసిన ఘనత టీడీపీకి, మాండ్ర శివానందరెడ్డికే దక్కుతుందన్నారు. చంద్రబాబు నాయుడు, మాండ్ర శివానందరెడ్డి, కార్యకర్తల కృషితోనే తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాన న్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు రూ.10కోట్ల నిధులతో సీసీ రోడ్లు వేయిస్తున్నా మన్నారు. అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు భూమి పూజ చేశామన్నారు. అలగనూరు రిజర్వాయర్ మరమ్మతుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయని, టెండర్ దశలో ఉందన్నారు. తంగడెంచ వద్ద పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

జిల్లాలో భారీ వర్షం

- ఉయ్యాలవాడలో 32.2 ఎంఎం వర్షపాతం
- శ్రీశైలంలో అత్యల్పంగా 1.4 ఎంఎం



బండిఆత్మకూరులో కురుస్తున్న వాన

నంద్యాల ఎడ్యుకేషన్, మే 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో శనివారం రాత్రి పలు మండలాల్లో భారీగా వర్షం కురిసింది. ఉయ్యాలవాడ మండలంలో 32.2 ఎంఎం అత్యధిక వర్షపాతం నమోదు కాగా శ్రీశైలంలో 1.4ఎంఎం అత్యల్ప వర్షపాతం నమోదైంది. అవుకు మండలం కొండమాయపల్లెలో 29.5, సంజామల మండలం ముదిగేడులో 24.5, కోవెలకుంట్లలో 23.75, పాణ్యం మండలం కౌలూరులో 22.0, నంద్యాల పట్టణంలో 19.5, రుద్రవరం మండలం యల్లావత్తులలో 18.0, గడివేములలో 17.0, ఆళ్లగడ్డలో 12.5, ప్యాపిలి మండలం మెట్టుపల్లెలో 9.0, బనగానపల్లె మండలం పలుకూరులో 8.75, పాములపాడు మండలం తుమ్మలూరులో 8.0, డోన్ మండలం జలదుర్తిలో 5.5, డోన్‌లో 4.25, అవుకు మండలం రామాపురంలో 4.0, అవుకు పట్టణంలో 2.5, శ్రీశైలంలో 1.4ఎంఎం వర్షపాతం నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది.

నేడు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం

నంద్యాల జిల్లాలో సోమవారం గంటకు 50 నుంచి 60కిలోమీటర్ల వేగంతో గాలులు, గంటకు 40నుంచి 50కిలోమీటర్ల వేగంతో ఉరుములతో కూడిన పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణ సంస్థ వెల్లడించింది. అలాగే అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశముందని, ఉరుములు, మెరుపుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణం

మహానంది, మే 18 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఆదివారం ఘనంగా మహానందీశ్వరుడి కల్యాణం నిర్వహించారు. ఆలయం ప్రాంగణం లోని అలంకార మంటపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేక పల్లకిలో ఆశీనులు గావించారు. అనంతరం వేదపండితుడు నాగేశ్వరశర్మ, సహాయ అర్చకుడు పుల్లారి జనార్దన్‌శర్మ వేదమంత్రాలతో కల్యాణం జరిపారు. దాతలుగా విద్యుత్‌శాఖ ఏఈ ప్రభాకర్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు. మహానంది క్షేత్రం ఆదివారం భక్తుల రద్దీతో పులకించింది. వీకెండ్‌తో పాటు వివాహాలకు మంచి ముహూర్తం ఉండటంతో క్షేత్రంలో పదుల సంఖ్యలో పెళ్లిళ్లు జరగడంతో బంధుగణంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. స్వామివారి దర్శనం కోసం వచ్చిన వేలాదిమంది భక్తులు ముందుగా ప్రాంగణంలోని కోనేర్లల్లో పుణ్య స్నానాలు ఆచరించడంతో పరిసరాలు రద్దీ వాతవరణం నెలకొన్నాయి. దేవస్థానానికి వివిధ సేవల ద్వారా రూ. లక్షలాది ఆదాయం వచ్చినట్లు ఏఈవో యర్రమల్ల మధు తెలిపారు.



మహానందిలో కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

డంపుయార్డులో చెత్త రీసైక్లింగ్

ఐటీసీ సంస్థతో ఒప్పందం


డంపుయార్డులో పేరుకుపోయిన చెత్త నిల్వలు

నంద్యాల టౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణాన్ని చెత్త రహితం చేయాలన్న సంకల్పానికి బీజం పడింది. ఇన్నేళ్ల ప్రభుత్వాలు మారిన ప్రణాళికలు కాగితాలకే పరిమితమైన చెత్తగుట్టలు తగ్గించడంలో విఫలమయ్యారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ దిశగా అడుగులు వేస్తోంది. సంవత్సరాల తరబడి పేరుకుపోయిన చెత్త నిల్వలు ఇక తగ్గుముఖం పట్టనున్నాయి. శుద్ధి చేసిన చెత్తను తిరిగి వినియోగించుకోవడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇందుకు ఐటీసీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

స్వచ్ఛాంధ్ర ద్వారా తడిపొడి చెత్తలను వేరు చేయడం సేకరించిన చెత్త ద్వారా వచ్చే వ్యర్థాలను ఆయా రకాలను వేరు చేయడం తద్వారా వాటిని అవసరమైన పరిశ్రమలకు విక్రయించడం జరగాల్సి ఉంది. ఈ నిల్వలను వేరు చేసుందుకు అవసరమైన యంత్రాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. చెత్తను రీసైకిలింగ్ చేసి సేంద్రియ ఎరువు రూపంలో రైతులకు అందజేయనున్నారు. ఈ పనులు పూర్తయితే గుట్టలా పేరుకుపోయిన వ్యర్థాలు ఇక దశల వారిగా తగ్గుముఖం పట్టనున్నాయి. ఈ పనులన్ని ఏడాదిలోపు పూర్తి చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు.

నంద్యాల పట్టణంలో 42వార్డులు ఉన్నాయి. సుమారు మూడు లక్షల జనాబా ఉన్నది. ప్రతి రోజూ 60 మెట్రిక్ టన్నుల చెత్త పోగు అవుతుంది.

గత ప్రభుత్వం ఇదే పద్ధతిలో మహారాష్ట్రకు చెందిన ఒక ప్రైవేటు సంస్థకు రూ.5కోట్ల కు టెండర్ వేసి ఇచ్చారు. కానీ కొన్ని నెలలు పని చేసి ఇక్కడి నుంచి మధ్యలో వదిలేసి వెళ్లిపోయ్యారు. కానీ ఈ ప్రభుత్వమైన చెత్త నిల్వలను తగ్గిస్తారో లేదో చూడాలి. డంపు యార్డులో చెత్త పేరుకుపోవడంతో ఆ దారిలో వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పురపాలక సంఘం తగిన చర్యలు తీసుకుని కాగితాలకు పరిమితం కాకుండా కార్యాచరణ చేయాలని పట్టణప్రజలు కోరుతున్నారు.

త్వరగా రీసైక్లింగ్ చేస్తాం

చెత్త రీసైక్లింగ్ చేయడానికి ఐటీసీ సంస్థతో ఒప్పందం జరిగింది. ఇటీవల ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. త్వరగా చెత్త రహిత నంద్యాలగా తీర్చిదిద్దుతాం.

-వెంకటదాస్ అసిస్టెంట్ కమిషనర్, నంద్యాల

రీసైక్లింగ్ చేయడానికి ఉపయోగించే మిషన్


వేసవి దుక్కులతో ప్రయోజనం

కొత్తపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): వేసవి దుక్కులు దున్నుకోవ డం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాయా ధికారి మహేష్ రైతులకు సూచించారు. వేసవి దుక్కులు చేసుకోవడం వల్ల భూములు పొడిబారి ఉండటం వల్ల గడ్డిమొ క్కలు మొలవకుండా కలుపు ఖర్చులు తగ్గించుకో వడానికి అవకాశం ఉందన్నారు. అలాగే వర్షం నీరు భూములోకి ఇంకి భూగర్భ నీటి మట్టం పెరుగుతుందన్నారు. వాలుకు అడ్డంగా దున్నడం వల్ల నేల కోతకు గురి కాకుండా ఉంటుందన్నారు. తొలకరిలో దున్నుకోవడం వల్ల నేలలోకి నీరు బాగా ఇంకిపోయి భూమి బాగా గుల్లబారి తర్వాత వేసే పం టకు ఉపయో గపడుతుందన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలను చూపుతున్న పోలీసులు

పగిడ్యాల, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు ప్రాతకోట గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పి. మహేశ్వరరెడ్డి ఇంట్లో 292 మద్యం సీసాలను సాధ్వీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి ఎస్‌ఐ చంద్రశేఖర్ ఆదివా రం తెలిపారు. గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమా చారం రావడంతో శనివారం రాత్రి ఎస్‌ఐ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహేశ్వరరెడ్డి ఇంట్లో వివిధ రకాలకు చెందిన 292 మద్యం సీసాలు లభ్యం కావడంతో వాటిని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమో దు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతులకు అండగా ఉంటాం


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

మిడుతూరు, మే 18(ఆంధ్రజ్యోతి): పైపాలెం గ్రామ రైతులకు ఏపీ రైతు సంఘం అండగా ఉంటుందని రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సభ్యులు నాగేశ్వరరావు, సీఐ టీయూ జిల్లా నాయకులు గోపాలకృష్ణ , ఉస్మాన్ బాషా అన్నారు. మండలంలోని పైపాలెం గ్రామా న్ని వారు సందర్శించి ప్రజల అభిప్రాయం తెలుసుకున్నారు. గ్రామంలో సోలార్ కంపెనీ వారు గ్రామ సభ జరపకుండా ప్రజల ఆమోదం లేకుండా పనులు ప్రారంభించారని, తరువాత మా భూములకు వెళ్లేందుకు ఉన్న రస్తాలను ఆక్రమించి పొలాల చుట్టూ ఉన్న రాళ్ల కతువలను తొలగించారని, చెరువులు, కుంటలను ఆక్రమించారని గ్రామ స్థులు తెలిపారు. అనంతరం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ సమ స్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో రైతు సయంఘం నాయకులు మద్దిలేటి, రామకృష్ణ, ఓబులేసు, వెంకటేశ్వర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జీవోలను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకుడు రామపక్కీరెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, మే 18 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్కరణ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను బలహీనపరిచేవిధంగా విడుదల చేసిన జీవోలను ఉపసంహరించుకోవాలని పీఆర్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. నంద్యాలలో పీఆర్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామపక్కీరెడ్డి, ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల నాయకులను చర్చలకు పిలిచి వారు లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా బలవంతంగా జీవోలను విడుదల చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఉపాధ్యాయ ఐక్యసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 21న నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు పాల్గొనాలని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం డీఎస్సీ పరీక్ష రాయబోయే అభ్యర్థుల కోసం పీఆర్‌టీయూ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబోయే మోడల్ పరీక్షకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు కృష్ణారావు, చంద్రశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, విజయరావు, జగదీష్‌బాబు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Nandyal. I issue the following notice to general public. My Clients intends to grant loan to **Sri Shaik Salam Basha S/o Shaik Murthuja, R/o H.No: 2-533, Urban Colony, Atmakur Village & Mandal, Nandyal District** by keeping the below mentioned property of him as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

Survey Numer: 1) 877/3 pyki 2) 877/3 pyki
Plot No: 1) Western portion of Plot No.52, 2) Eastern portion of Plot No.52
Measurements/ Extent of Property:
1) Ac.0.01-25 cents & 60.95 Sq yards
2) Ac.0.01-25 cents & 60.43 Sq yards

BOUNDARIES:
East: Eastern portion of plot no.51 of Shaik Hussain Basha purchased by the Applicant. i.e item No.2 property/ ies offered as Security, **West :** Plot No:57, **North :** 20 feet wide Rastha, **South :** Land of Bhoosi Reddy.

T.V. PRASAD
Advocate, Nandyal.

మహానందిలో రాజంపేట ఎమ్మెల్యే పూజలు


మహానందిలో వేదపండితుల ఆశీర్వాదం పొందుతున్న ఎమ్మెల్యే

మహానంది, మే 18 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి దంపతులు ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి,అమ్మవార్లకు ఎమ్మెల్యే దంపతులు అభిషేకార్చనలు చేశారు. కల్యాణ మంటపంలో వేదపండితులు వీరిని ఆశీర్వదించి శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు.

మహానందిలో భక్తుడుకి బంగారు చైన్ అప్పగింత


భక్తుడికి బంగారు చైన్‌ను అందజేస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి

మహానంది, మే 18 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయ కోనేరులో భక్తుడు జారవిడుచుకున్న బంగారు హారాన్ని భక్తులకు అప్పగించారు. ఆదివారం నంద్యాలకు చెందిన చంద్రశేఖర్ కుటుంబ సభ్యులతో కలసి మహానందికి వచ్చారు. కోనేరులో పుణ్యస్నానాలు చేస్తుండగా బంగారు చైన్ పడిపోయింది. అక్కడ విధుల్లో ఉన్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక చెంచు యువకులతో కోనేరులో వెతికించి దొరికిన బంగారు చైన్‌ను టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాధిత భక్తులకు తిరిగి అప్పగించారు.

గాజులపల్లిలో యువకుడిపై దాడి

మహానంది, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లి గ్రామం ప్రధాన మెట్ట వద్ద శనివారం అర్ధరాత్రి అబ్దుల్ ఖాదర్ అనే యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఆదివారం ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అబ్దుల్ ఖాదర్‌పై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి తీవ్రంగా గాయపరిచారు. యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

'చలో విజయవాడ'ను విజయవంతం చేయండి

నంద్యాల మున్సిపాలిటీ, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యలపై చేపడుతున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి ప్రభుత్వం ఉద్యోగుల సంఘం కోరింది. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆదివారం సాయంత్రం నంద్యాల జిల్లా కార్యాలయంలో సమావేశమైంది. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూల ధోరణితో వ్యవహరించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఐఆర్‌తో పాటు పీఆర్‌సీ ప్రకటించి విడుదల చేయాలని కోరుతూ నిరసన తెలుపుతున్నట్లు తెలిపారు. సమావేశంలో సహాయ అధ్యక్షుడు శ్రీ హరి, కోశాధికారి శ్రీను, ఉపాధ్యక్షులు సునీల్ కుమార్ పాల్గొన్నారు.

కురిసిన వర్షం

బండిఆత్మకూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ఉక్కపోత తాళలేకపోతున్న సమయంలో బండిఆత్మకూరులో అరగంటపాటు ఎడతెరపి లేకుండా వాన కురిసింది. ఆదివారం మధ్యాహ్నం 3:30 గంటల నుంచి 4 వరకు ఎలాంటి విరామం లేకుండా వర్షం పడింది. భానుడి భగభగలతో తల్లడిల్లిన జనం ఈ వానతో ఉపశమనం పొందారు. వాతావరణం పూర్తిగా చల్లబడింది.

సిద్ధేశ్వర స్వామిని దర్శించుకున్న న్యాయాధికారి


ఓంకారంలో అర్చకుల ఆశీర్వచనాలు అందుంటున్న న్యాయాధికారి మల్లేశ్వరి

బండిఆత్మకూరు, మే 18(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలోని ఓంకార క్షేత్రం గంగా ఉమా సమేత సిద్ధేశ్వర స్వామి వార్లను కర్నూలు జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి టీ. మల్లేశ్వరి దర్శించుకున్నారు. ముందుగా ఓంకారం చేరుకున్న న్యాయాధికారి దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామి వార్లకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అభయాంజనేయ స్వామికి ప్రదక్షిణలు చేశారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం కాశిరెడ్డినాయన ఆశ్రమంలో అన్నపూర్ణేశ్వరి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

భారీ వాహనాలతో దెబ్బతిన్న రహదారులు

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాటసారులు

కొత్తపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): కర్నూలు-ఆత్మకూరు నేషనల్ హైవే రహదారి నిర్మాణం కోసం అధిక లోడుతో భారీ వాహనాలు తిరగడం వల్ల రహదారులు గుంతలమయ్యాయి. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే బాటసా రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లి మండలం నందికుంట గ్రామ శివారులో కొందరు రైతుల నుంచి నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం కోసం మట్టిని తవ్వకునేందుకు సుమారు 15 ఎకరాల భూమిని సదురు కాంట్రా క్టరు కొనుగోలు చేసినట్లు తెలిసింది. అక్కడి నుంచి నిత్యం భారీ వాహనా లతో కెపాసిటీ మించి 20 టన్నులకు పైగా మట్టిని నందికుంట గ్రామం మీదుగా ఆత్మకూరు ప్రాంతంలో హైవే రహదారుల కోసం వేల కొద్ది మట్టిని తరలిస్తున్నారు. దీంతో బీటీ రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమ యమైంది. ఈ రహదారి గూండా వెళ్లే ద్విచక్ర, ఆటోలు, ఇతర వాహన దారులు తీవ్ర ఇక్కట్లుకు గురవుతున్నారు. ఈ విషయం మండల అధికారు లకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా భారీ వాహనాలు కాకుండా చిన్నపాటి వాహనాల ద్వారా మట్టిని తరలించాలని, గుంతలమయమైన రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


నందికుంట గ్రామ సమీపంలో గుంతల మయమైన రహదారి ఇదే

సంప్రదాయాలను కాపాడేది వీహెచ్‌పీనే

అఖిలభారత స్థాయి సంపర్కప్రముఖ్ సంజయ్ దావళికర్

నంద్యాల కల్చరల్, మే 18(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో సంస్కృతి సంప్రదాయాలను కాపాడేది విశ్వహిందూపరిషత్ మాత్రమేనని అఖిల భారతస్థాయి సంపర్క ప్రముఖ్ సంజయ్ దావళికర్ అన్నారు. ఆదివారం విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో సంస్కృతి - సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు సమాజం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథి హాజరైన సంజయ్ దావళికర్ మాట్లాడుతూ హిందూ సమాజంపై జరుగుతున్న అనేక రకాల దాడుల గురించి చర్చించారు. కొందరు సంస్కృతిక జీవన విలువల నుంచి దూరం చేస్తూ ఆరోగ్యకరమైన జీవనవిధానాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. రాబోయే తరాలు ఆనందంగా జీవించే మార్గాలను అన్వేషించడం మనందరి బాధ్యతగా భావించాలన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, సంపర్క విభాగం రాష్ట్ర ప్రముఖ్ ప్రతాప్‌రెడ్డి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ పోలేపల్లి సందీప్, నంద్యాల జిల్లా అధ్యక్షులు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి కిషోర్, సహకార్యదర్శి నాగరాజు, నగర అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, చంద్రశేఖర్, నగర ప్రముఖులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంజయ్ దావళికర్

వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు

బండిఆత్మకూరు మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళరెడ్డి పేట గ్రామంలో భూదేవి, శ్రీదేవి సహిత వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు. ముందుగా గ్రామానికి చురుకున్న ఎమ్మెల్యేకు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పూజలు, హోమాలు చేశారు. గ్రామస్థులంతా సుఖసంతోషాలతో ఉండేలా స్వామివార్ల అనుగ్రహం కలుగాలని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట కేసీ కెనాల్ చైర్మన్ బీ రామలింగారెడ్డి, శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు డాక్టర్ చిట్టిబొట్ల భరద్వాజశర్మ, నాయకులు శివయ్య, శీను, వెంకటరామిరెడ్డి, కేసీ లింగారెడ్డి, రామకృష్ణ, వడ్డు మధుసూదన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహానాడును జయప్రదం చేయండి

నంద్యాల రూరల్ , మే 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల అసెంబ్లీ స్థాయిలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాల, పట్టణ పరిదిలోని టీడీపీ నాయకులు, బూత్ ఇన్‌చార్జీలు కార్యకర్తలు నియోజక వర్గ స్థాయి మహానాడుకు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. అలాగే ఈనెల 27,28,29తేదీల్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాప కులు రామారావు జయంతిని పురస్కరించుకొని నిర్వహించే రాష్ట్రస్థాయి మహానాడును కూడా విజయవంతం చేయాలని కోరారు.

మున్సిపల్ కార్మికుడి కుటుంబానికి చేయూత


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో కార్మికుడిగా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణిం చిన అబిదాల్లి కుటుంబానికి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లా యీస్ యూనియన్, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రూ.38 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు ఏసురత్నం, రామ్‌నాయక్, రణధీర్, నాగరాజు, నాగన్న, గొడుగు రాజు, తిమ్మయ్య, జయన్న, నబిఖాన్, రాజేంద్రలు మాట్లాడుతూ అనారోగ్యంతో మరణించిన మున్సిపల్ కార్మికుడు అబిదాల్లి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఎయిడ్స్ బాధితుల్లో ఆత్మస్థైర్యం నింపాలి


ఆత్మకూరులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ బాధితుల్లో ఆత్మస్థైర్యం నింపాలని ప్రోగ్రామ్ మేనేజర్ జుల్ఫికర్ అలిఖాన్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ క్యాండిలైట్ మెమోరియల్ డే ను పురస్కరించుకుని స్థానిక గౌడ్‌సెంటర్ నుంచి పాతబస్టాండ్ వరకు మెరిబా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎయిడ్స్‌తో మరణించిన వారికి నివాళి అర్పించారు. ఈసందర్భంగా జుల్ఫికర్ అలిఖాన్ మాట్లా డుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు వైద్యుల సూచనలు పాటిస్తూ సరైన పౌష్టికాహారాన్ని తీసుకున్నట్లయితే జీవితకాలాన్ని పెంచు కోవచ్చునని అన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య, సంపూర్ణ సురక్షా మేనేజర్ జబివుల్లా, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

● ఎంపీ బైరెడ్డి శబరి ● ఆలయంలో పూజలు


వీరపాలెంలో పూజలు చేస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

గడివేముల, మే 18 (ఆంధ్రజ్యోతి): వీరప్పస్వామి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. మండలంలోని కరిమద్దెల గ్రామంలో జరుగుతున్న వీరప్పస్వామి ఉత్సవాల్లో ఆదివారం ఎంపీ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. వీరప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీడీపీ గ్రామ నాయకులు పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.

వీరప్పస్వామికి గౌరు జనార్దన్‌రెడ్డి ప్రత్యేక పూజలు

మండలంలోని కరిమద్దెల గ్రామంలో వీరప్పస్వామికి టీడీపీ నాయకులు గౌరు జనార్దన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, మాజీ కో-ఆప్షన్‌మెంబర్ ఎస్‌ఏ రఫిక్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ


పూజల్లో పాల్గొన్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం పెద్దఅనంతాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సుంకులమ్మ అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన ఈ వేడుకల్లో భాగంగా చివరి రోజు ఆదివారం సుంకులమ్మ, పోతురాజు, నాభిశిలా (బొడ్రాయి) ప్రతిష్ఠ పురోహితులు గరుడాద్రి సత్యనారాయణ నేతృత్వంలో శాస్త్రోక్తంగా సాగాయి. ముందుగా గోపూజ, గర్తుపూజ, ఆవాహిక దేవతా హోమాలు, యంత్ర, విగ్రహ ప్రాణప్రతిష్ఠలు, కూష్మాండబలి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ వేడుకలకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ నిర్వాహ కులు ఆయన్ని శాలువతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

నాసిరకం విత్తు.. నమ్మితే చిత్తు..!

3వ పేజీ తరువాయి

పత్తి విత్తనోత్పత్తి రైతులు పండించిన పత్తి విత్తనాలను వివిధ విత్తన కంపెనీలు ముందస్తు ఒప్పందం మేరకు 450 గ్రాముల ప్యాకెట్ రూ.400-450లకు తీసుకుంటున్నారని ఓ రైతు తెలిపారు. ఎకరాకు 550-600 ప్యాకెట్లు (2.50 - 2.70 క్వింటాళ్లు) దిగుబడి వస్తుందని అంచనా. గ్రో-అవుట్ టెస్ట్ (జీవోటీ), జెనెటికల్లి మోడిఫైడ్ ఆర్గనిజమ్స్ (జీఎంవో) టెస్టులు రైతులే చేయించాలి. ఆ టెస్టుల్లో ఉత్తమ ఫలితాలు వస్తేనే తీసుకుంటాయి. ఆ విత్తనాలను కంపెనీ లేబుల్‌పై మార్కెట్‌లో ఒక్కో ప్యాకెట్ కనీస మద్దతు ధర రూ.901లకు విక్రయిస్తున్నారు. విత్తన కంపెనీలు ధర గిట్టుబాటుకాక, విత్తనోత్పత్తి రైతులు ఒప్పందం ప్రకారం ఎకరాకు 400-450 ప్యాకెట్లు కంపెనీలకు ఇచ్చి, మిగిలిన విత్తనాలు మధ్య దళారులు ద్వారా అనధికారిక అమ్మకాలు సాగిస్తున్నారు. కొందరు దళారులైతే జీవోటీ, జీఎంవో పరీక్షల్లో సరైన ఫలితాలు రాని విత్తనాలను సేకరించి, వాటిని నాణ్యమైన విత్తనాలలో కలిపి వివిధ లేబుల్స్ పేరిట ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని బూత్‌పూర్ అడ్డాగా ఈ బాగోతం సాగుతున్నట్లు సమాచారం. తక్కువ ధరకు వస్తాయని నాసిరకం విత్తనాలు కొనుగోలు చేసి మోసపోతున్నారు. నాసిరకం, అనుమతి లేని విత్తనాలు వల్ల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఎకరాకు 3-4 క్వింటాళ్లు దిగుబడి కోల్పోవాల్సి వస్తుందని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ విషయాలపై రైతుల్లో అవగాహన కల్పించడంలో వ్యవసాయ అధికారులు వైఫల్యం చెందారనే ఆరోపణలు లేకపోలేదు.

జాగ్రత్తలు పాటించాలి

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి
- విత్తన ప్యాకెట్లపై పేరు, గడువు తేదీ వివరాలు తప్పకుండా గమనించాలి
- సీలు వేసిన బస్తాలు, ధృవీకరణ పత్రాలు ఉన్న విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలి
- రసీదు తప్పకుండా తీసుకోవాలి. ఆ రసీదుపై విత్తనం రకం, గడువు తేదీ, డీలర్ సంతకం, రైతు సంతకం ఉండేలా చూసుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేయడానికి ముందు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవడం ఉత్తమం.

● 475 గ్రాముల బీటీ-2 పత్తి విత్తన ప్యాకెట్ కనీస మద్దతు ధర పెరుగుదల ఇలా:

సంవత్సరం	ఎమ్మార్పీ	భారం
2019	710	--
2020	730	20
2021	767	37
2022	810	80
2023	853	43
2024	863	10
2025	901	38

ప్రత్యేక బృందాలతో నిఘా

జిల్లాల్లో ఈ ఏడాది 2.25 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేస్తారని అంచనా. ఎకరాకు 3 ప్యాకెట్లు పత్తి విత్తనాలు భూమిలో వేస్తున్నారు. ప్రస్తుతం 15 లక్షల విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. నాసికరం, అనుమతి లేని విత్తనాలు గ్రామాల్లో అమ్మకాలు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. నిరోధించడానికి ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశాం. ఏ గ్రామంలోనైనా అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం ఇస్తే దాడులు చేస్తాం. రైతులు కూడా అనుమతి లేని విత్తనాలు కొనుగోలు చేయరాదు. దీనిపై రైతుల్లో చైతన్యం తీసుకొస్తాం.

- వరలక్ష్మి, జేడీ, వ్యవసాయ శాఖ, కర్నూలు

మహిమాన్వితురాలు..
మహాయోగి లక్ష్మమ్మ అవ్వ

- కొలిచేవారికి కొంగుబంగారం
- విద్యుద్దీపాలతో ఆలయం అలంకరణ
- అవ్వ మహాద్వారం ఏర్పాటుతో కొత్తశోభ
- నేడు ఆదోనిలో మహా రథోత్సవం



విద్యుద్దీపాలంకరణలో లక్ష్మమ్మ అవ్వ ఆలయం



ఆదోని , మే18 (ఆంధ్రజ్యోతి): మహిమాన్వితురాలు మహాయోగి లక్ష్మమ్మ అవ్వ. తన మహిమలతో సమసమాజం కోసం కృషిచేశారు. అవధూతగా లక్షల మంది నీరాజనాలు అందుకుంటున్నారు. కొలిచే వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మహాయోగి లక్ష్మమ్మ అవ్వ రథోత్సవం ఆదోని పట్టణంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు జరుగనుంది. సోమవారం తెల్లవారుజామున నుంచే అవ్వ దర్శనం కోసం భక్తులు బారులు తీరనున్నారు. అంతకుముందు అవ్వ మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అవ్వ బృందావనాన్ని, మూల విరాట్‌కు బెంగళూరు నుంచి తెప్పించిన పూలతో అలంకరిస్తారు. మహా రథోత్సవాన్ని పురస్కరించుకొని ఆదోని పట్టణంలోని అవ్వ అలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మహిమలు ప్రదర్శిస్తూ...

మహాయోగి లక్ష్మమ్మ అవ్వకు ఘన చరిత్ర ఉంది. ఆలూరు మండలం ముసానపల్లి గ్రామానికి చెందిన దళిత దంపతులు మంగమ్మ, బండెప్పల రెండో కుమార్తె చిన్న లక్ష్మమ్మ. ఆమెకు యుక్త వయస్సు రాగానే కర్నాటకలోని ఇమ్రాపురం గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. కారుణ జన్మరాలైన లక్ష్మమ్మ సాధారణ మహిళగా జీవనం సాగించలేకపోయింది. సమసమాజ స్థాపనతో పాటు ప్రేమ, దయ, దానం ధర్మం, ఆధ్యాత్మికతను వ్యాపింపజేసేందుకు ఆమె నడుం బిగించారు. తాను ఆశించిన సమాజ ఆవిష్కరణ కోసం ఎన్నో మహిమలు ప్రదర్శిస్తూ ఊరూరు తిరిగారు. ఎంతోమందిలో మార్పు తెస్తూ ఆదోనికి చేరారు. తాను సంకల్పించిన సమాజం ఆవిష్కారానికి బీజం పడిందని తెలుసుకున్న మహా సాధ్విని 1933మే 16వ తేదీన పరబ్రహ్మంతో లీనమయ్యారు. తాము కోరిన కోరికలను తీర్చిన అవ్వ ఇకలేరని తెలుసుకున్న లక్షలాదిమంది భక్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆమె పరబ్రహ్మలో లీనమైన చోటే బృందావనం ఏర్పాటుచేశారు. కారుణ్యమూర్తి అయిన అవ్వ పరబ్రహ్మలో లీనమైన రోజు వైశాఖ బహుళ సప్తమినాడు మహారథోత్సవం నిర్వహిస్తున్నారు.

భక్తుల సహకారంతో వెండి రథం

భక్తుల సహకారంతో ఆలయ నిర్వాహకులు 93 ఏళ్ల క్రితం వెండి రథం ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ఈరథంలోనే అవ్వ ఊరేగుతున్నారు. అవ్వ మూలవిరాట్, ఉత్సవ విగ్రహంతో పాటు ఆలయంలోని అవ్వ గర్భగుడి, బృందావనానికి కూడా వెండి తొడుగులు ఏర్పాటుచేశారు. పట్టణ ప్రముఖులు రాచోటి కుటుంబానికి చెందిన వారు ఆలయానికి వంశ పారంపర్య ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య ధర్మకర్తగా ఉన్నారు.

రథోత్సవం అగ్రభాగాన దళితులు

అవ్వ రథోత్సవంలో ముసానపల్లికి చెందిన దళితులు అగ్రభాగాన కొనసాగుతారు. దళితులు రథోత్సవంలో అగ్రభాగాన ఉండడం అవ్వ సంకల్పంగా పేర్కొంటారు. దళిత ముత్తైదువులు కలశాలతో కొనసాగగా పురుషులు కాషాయ జండాలతో నడుస్తారు. ఉదయమే పల్లకోత్సవంతో ముసానపల్లె నుంచి ఊరేగింపుగా వచ్చి ఆలయానికి చేరి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ముసానపల్లెలో కూడా ఆలయం నిర్మించారు. అక్కడ కూడా మహాయోగిని నిత్యపూజలు అందుకుంటున్నారు.

రూ. కోటితో అవ్వ మహా ద్వారం

ఆదోని పట్టణంలోని ఆలూరు రోడ్డులో రూ.కోటితో అవ్వ మహాద్వారం నిర్మించారు. పట్టణా నికి మహాద్వారం నిర్మించడంతో ఎంతో అందం తెచ్చిపెట్టింది పట్టణానికి వచ్చే వారికి అవ్వ ఆహ్వానం పలుకుతున్నట్లు ఉందని పలువురు భక్తులు పేర్కొంటున్నారు.

అన్నిఏర్పాట్లు: అవ్వ సంకల్పం మేరకు సామాజిక కార్యక్రమాలు రాచోటి రామయ్య, అవ్వ ఆలయం వంశపారంపర్య ధర్మకర్త అవ్వ సంకల్పం మేరకు సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. భక్తులు కూడా అవ్వసన్నిధిలో చేపట్టే కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తున్నారు. సోమవారం జరిగే మహారథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశాం. నీడ కోసం షామియానాలు, దాహార్తి తీర్చేందుకు తాగునీరు ఏర్పాటు చేశాం. జిల్లా నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక నుంచి లక్షల మంది భక్తులు రథోత్సవంలో పాల్గొంటారు.

విద్యాసాగర్ ఎంపికకు ఏకగ్రీవ తీర్మానం



విద్యాసాగర్‌ను సన్మానిస్తున్న జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, మే 18(ఆంధ్రజ్యోతి): త్వరలో భర్తీ కానున్న ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష పదవికి విద్యాసాగర్‌కు జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఏకగ్రీవ తీర్మానం తెలిపింది. ఆదివారం ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్‌ను జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంగల్ రెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు వెంగల్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు దస్తగిరిరెడ్డి, నగర అధ్యక్ష కార్యదర్శులు ఎంసీ కాశన్న, ఎం.రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించారు. ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షులుగా విద్యాసాగర్, రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా దస్తగిరిరెడ్డిని బలపరుస్తూ జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసి యేషన్ తీర్మాన పత్రాన్ని వారికి అందజేశారు. కార్యక్రమంలో కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, ఆలూరు, డోన్, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, నంద్యాల. ఆత్మకూరు, నందికొట్కూరు తాలుకా అధ్యక్షులు శ్రీనివాసయాదవ్, మద్దిలేటి, బజారి, సాయిబాబా, మోహన్,షెమిలా, వెంకటేశ్వర్లు, మునిస్వామి, నాగార్జునరెడ్డి, హుశేన్ రెడ్డి, మోహన్‌రెడ్డి, రాముడు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అప్పులబాధతో వ్యక్తి బలవన్మరణం



రంగన్న (ఫైల్)

కోడుమూరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి విషం తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని లద్దగిరి గ్రామంలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన చింతచిగురు రామదాసు కొడుకు చింతచిగురు రంగన్న(35). ఎకరా పొలంలో తండ్రీకొడుకులిద్దరూ వ్యవసాయం చేస్తున్నారు. వ్యవసాయ పనులు లేని సమయంలో రంగన్న కూలీ పనులకు వెళ్తూ భార్యా, నలుగురు పిల్లలను పోషిస్తున్నాడు. అయితే వ్యవసాయం, కుటుంబ అవసరాలకు రంగన్న రూ.3లక్షలు అప్పులు చేశాడు. వీటిని ఎలా తీర్చాలోనని మదన పడుతుండేవాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం సాయంత్రం పొలం వద్ద మద్యంలో విషం కలుపుకొని తాగాడు. సమాచారం అందుకున్న తండ్రి రామదాసు, భార్య సుభాత అక్కడికి చేరుకొని హుటాహుటిన కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం రంగన్న మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి రామదాసు ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఫ్లైఓవర్ నుంచి పడి వ్యక్తి దుర్మరణం



కృష్ణమోహన్ (ఫైల్)

డోన్ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఫ్లైఓవర్ నుంచి ఫుట్‌పాత్‌పై పడి ఓ వ్యక్తి దుర్మణం చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకున్నట్లు అర్బన్ సీఐ ఇంతియాజ్ ఆదివారం తెలిపారు. వివరాలు.. పట్టణంలో చిగురుమానుపేటకు చెందిన కృష్ణమోహన్(25) బైక్‌పై కొత్తబస్టాండ్ నుంచి చిగురుమానుపేటకు వెళ్తున్నాడు. ఫ్లైఓవర్‌లో బైక్ ఓవర్‌స్పీడ్ వల్ల అదుపు తప్పి కింద ఫుట్‌పాత్‌పై పడ్డాడు. తీవ్రగాయాలు కాగా హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ తెలిపారు.

సీఎం పర్యటన విజయవంతం

● కూటమి శ్రేణులకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే గౌరు చరిత



కల్లూరు, మే 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు కర్నూలు పర్యటనను విజయవంతమైందని, ఇందుకు కూటమి నాయకులు, కార్యకర్తలకు పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ధన్యవాదాలు తెలిపారు. పాణ్యం నియోజకవర్గం అభివృద్ధికి సీఎం చంద్రబాబు వరాలు ప్రకటించడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పార్కులు వంటి మౌలిక వసతుల కల్పనకు సీఎం ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారన్నారు. అందులో భాగంగానే రూ.50కోట్ల నిధుల విడుదలకు ఆమోదం తెలిపారని ఎమ్మెల్యే చెప్పారు. తక్షణమే కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) నుంచి రూ.5 కోట్లు, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రూ.3 కోట్లు మొత్తం 8కోట్ల నిధుల విడుదలకు మున్సిపల్‌శాఖ మంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని గౌరు చరిత వివరించారు. నియోజకవర్గం పరిధిలోని శివారుల ప్రాంతాలు, కాలనీల్లో త్వరలో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కల్లూరు అర్బన్ 16 వార్డుల తాగునీటి సరఫరా కోసం గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు ప్రక్రియను ప్రాధాన్యతా అంశంగా పరిగణించి ప్రజలకు తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అంతే కాకుండా సఫా కాలేజీ నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు రహదారి పనులు మంజూరైన గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. అనుమతి రాగానే పనులు పూర్తికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా

● కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



మాట్లాడుతున్న కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటానని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ భవనంలో ఆదివారం కోడుమూరు నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ టీడీపీకి కార్యకర్తలే బలం అని, రానున్న రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల రుణం తీర్చుకోలేనిదని, పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తిస్తుందని అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి మాట్లాడుతూ టీడీపీకి కార్యకర్తలే నిజమైన సైనికులు అన్నారు. అధినేత, సీఎం చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ ఆశయాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే జిల్లా మహానాడు, తర్వాత కడపలో జరిగే మహానాడును ధిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. కేడీసీసీబీ చైర్మన్‌గా ఎంపికైన ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గంలో ఎలాంటి వర్గ విభేదాలు లేవని, నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటాననీ భరోసానిచ్చారు. రాబోయే 27వ తేదీన జరగబోయే మహానాడు కార్యక్రమాన్ని భారీ ఎత్తున జయప్రదం చేయాలని కోరారు. కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ మినీ మహానాడును కోడుమూరు నియోజకవర్గంలో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఎంతో సహకారం అందిస్తున్నారని వివరించారు. కోడుమూరు నియోజకవర్గ పరిశీలకుడు రామలింగారెడ్డి, నాయకులు, కర్నూలు, గూడూరు, బెళగల్, కోడుమూరు మండలాల కార్యకర్తలు, సాధికార సభ్యులు పాల్గొన్నారు.

అప్పు చెల్లించాలని అడిగినందుకే హత్య

- కత్తులతో నరికివేత ● ప్రధాన నిందితుడి అరెస్టు
- పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య
- వీడిన పెద్దవెంకటేష్ హత్య కేసు మిస్టరీ

ఆలూరు, మే 18(ఆంధ్రజ్యోతి): అప్పును చెల్లించాలని అడిగినందుకే పెద్దవెంకటేష్‌ను పథకం ప్రకారం హత్య చేశారని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కంటినేని సోమన్నను పోలీసులు అరెస్టుచేశారు. ఆదివారం సాయంత్రం ఆలూరు పోలీస్‌స్టేషన్‌లో పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య విలేకరుల సమావేశంలో హత్యకు గల కారణాలను వెల్లడించారు. అమృతాపురం గ్రామానికి చెందిన కంటినేని పెద్ద వెంకటేష్ అందరికీ వడ్డీలకు అప్పులు ఇచ్చేవాడు. బంధువు అయిన కంటినేని సోమన్నకు కూడా రూ.2.50లక్షలు అప్పు ఇచ్చా డు. డబ్బులు చెల్లించాలని వెంకటేష్ ఒత్తిడి చేయగా రూ.60వేలు వడ్డీ సోమన్న చెల్లించాడు. ఇంకా రూ.4లక్షలు అప్పు ఉందని వెంకటేష్ దబాయించాడు. సోమన్నతో తిరిగి ప్రామిసరీ నోటు రాయించుకున్నాడు. మిగిలిన అప్పు చెల్లించాలంటూ బెదిరింపులకు పాల్పడుతుండగా పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా కొనసాగింది. సోమన్న కల్యాణదుర్గం మండలం శెట్టూరులో పొలం కౌలుకు తీసుకుని అక్కడే ఉంటున్నాడు. కాగా వెంకటేష్ అప్పు చెల్లించాలంటూ సోమన్నపై కోర్టులో కేసు వేశాడు. గ్రామంలో సోమన్నకు చెందిన ఐదెకరాల పొలంను ఆక్రమించుకొని సాగుచేస్తున్నాడని, అతడి భార్యతో వివాహేతర సంబంధాన్ని వెంకటేష్ కొనసాగిస్తున్న విషయాన్ని నటరాజగౌడ్ సోమన్నకు చెప్పాడు. దీంతో ఎలాగైనా సరే వెంకటేష్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. బావమరిది ధనుంజయ్, హొళగుందకు చెందిన చాకలి నాగరాజు, అమృతాపురానికి చెందిన నటరాజగౌడ్, కర్ణాటకలోని ఉత్తనూరుకు చెందిన జోగప్ప కలిసి హత్య చేసేందుకు రూ.2 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పథకం ప్రకారమే పశువులు మేపేందుకు వెళ్లిన కంటినేని పెద్ద వెంకటేష్‌ను కత్తులతో నరికి చంపారు. ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐ చంద్రతో కలిసి అన్ని దర్యాప్తు చేశారు. మిగిలిన ఐదుగురిని కూడా త్వరలోనే పట్టుకుంటామని, ప్రధాన నిందితుడు నిందితుడు సోమన్నను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

పేగుల ఆరోగ్యం ఎంతో కీలకం

● గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ దువ్వూరి నాగేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వరరెడ్డి

కర్నూలు హాస్పిటల్, మే 18 (ఆంధ్రజ్యోతి): పేగుల ఆరోగ్యం సరిగ్గా లేకపోతే జీర్ణక్రియకు సంబంధించిన సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, పేగుల ఆరోగ్యం రానున్న రోజుల్లో ఎంతో కీలకం కానుందని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ చైర్మన్, పద్మవిభూషణ్ డాక్టర్ దువ్వూరి నాగేశ్వరరెడ్డి అన్నారు. కర్నూలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఐఎంఏ భవన్‌లో డా.కేబీ కృష్ణమోహన్ మెమోరియల్ స్మారక ఉపన్యాసంలో భాగంగా పేగుల ఆరోగ్యంపై ఆయన మాట్లాడారు. పేగుల్లో మంచి బ్యాక్టీరితో అనేక లాభాలు ఉన్నాయని, అవి చెడిపోతే హార్ట్, కిడ్నీ, బ్రెయిన్ దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పేగుల్లో చెడ్డ బ్యాక్టీరియా రావడానికి ప్రధానంగా మహిళలు సీజేరియన్ ఆపరేషన్లు చేయించుకోవడం తల్లులు పిల్లలకు 6 నెలల వరకు పాలు ఇవ్వకపోవడం, పిల్లలకు 6 నెలల వయస్సు వరకు పిల్లలు యాంటి బయాటిక్స్ వాడటం వంటి మూడు కారణాల వల్ల చెడు బ్యాక్టీరియాలు వస్తాయన్నారు.

'40 శాతం పిల్లల్లో ఫ్యాటీ లివర్'

ఇటీవల హైదరాబాదులో స్కూల్ పిల్లలపై చేసిన సర్వేలో 30 నుంచి 40 శాతం చెడ్డ బ్యాక్టీరియాతో పాటు ఫ్యాటీ లివర్ ఉన్నట్లు గుర్తించినట్లు డాక్టర్ నాగేశ్వరరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల పిల్లల్లో లివర్ చెడిపోయే ప్రమాదం ఉందన్నారు. ఫాస్ట్‌ఫుడ్‌లోని రసాయనాల వల్ల చెడు బ్యాక్టీరియా వచ్చే ప్రమాదం ఉందన్నారు. భవిష్యత్తులో స్టూల్ (మలం) సంబంధిత ఫీకల్ మైక్రో బయోట్రాన్స్ ప్లాంటు థెరపీలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయనీ, ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా స్టూల్ బ్యాంకులు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. రానున్న రోజుల్లో ఎంఎఫ్‌టీ ద్వారా స్టూల్ చికిత్స రానున్నదని, కొత్తగా పిల్‌బాల్ ద్వారా ఎండోస్కోపి విధానం చేస్తున్నామని చెప్పారు. ఆరోగ్యవంతుల నుంచి సేకరించిన స్టూల్ నమూనాల నుంచి తీసిన గట్ మైక్రోబయోమ్స్‌ను ఉపయోగించి రోగులకు మార్పిడి చేసే జీర్ణ సంబంధిత వ్యాధులను నయం చేసే దిశగా పరిశోధనలు సాగుతున్నాయన్నారు. డయాబెటిక్‌లో టైప్-1 పిల్లల్లో, టైప్-2 పెద్దల్లో వస్తుందని, టైప్-3 ప్రాంక్రియాస్ చెడిపోవడం వల్ల వస్తుందన్నారు. ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు ఆ.రామచంద్ర నాయుడు, డా.ఎస్‌వీ రామ్మోహన్ రెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు డా.బి.శంకర్‌శర్మ, డాక్టర్ వీ.వెంకటరంగారెడద్ది, ఐఎంఏ కోశాధికారి డా.మాధవి శ్యామల, వైద్యులు పాల్గొన్నారు.

తుగ్గలిలో వజ్రం లభ్యం

తుగ్గలి, మే 18 (ఆంధ్రజ్యోతి): తొలకరి జల్లులు కురవడంతో ఓ వ్యవసాయ కూలీకి వజ్రం లభ్యమైంది. ఆదివారం మండల కేంద్రమైన తుగ్గలిలో వ్యవసాయ పనులు చేస్తున్న ఓ కూలీకి వజ్రం దొరకడంతో జొన్నగిరికి చెందిన ఓ వజ్రాల వ్యాపారి రూ.1.50 లక్షలకు కొనుగోలు చేసినట్లు సమాచారం. తొలకరి జల్లులు కురిసినప్పుడు జొన్నగిరి, పగిడిరాయి, ఉప్పర్లపల్లి తదితర గ్రామాల్లో విరివిగా వజ్రాలు లభిస్తుంటాయి.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

ఆలూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ఆస్పరికి చెందిన బీటెక్ విద్యార్థి ఆనంద్(19) శనివారం అర్ధరాత్రి ఆలూరు శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆలూరు ఎస్ఐ మహబూబ్‌బాషా తెలిపిన వివారల మేరకు.. ఆస్పరికి చెందిన తిమ్మన్న, శకుంతల దంపతుల కుమారుడు ఆనంద్ గుంటూరు జిల్లా ఆర్‌బీ ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. తన సోదరి వివాహం కోసం ఇద్దరు స్నేహితులతో కలిసి హొళగుంద మండలం వందవాగిలి గ్రామంలో ఆదివారం జరగనుండడంతో స్నేహితులు పూర్ణ చంద్ర, తిమ్మప్పతో కలిసి ద్విచక్ర వాహనంపై శనివారం రాత్రి వస్తున్నారు. ఆదోని నుంచి వస్తున్న ఓ వాహనం ఆలూరు శివారులో మారెమ్మవ్వ ఆలయం వద్ద అదుపు తప్పి మోటర్‌సైకిల్‌ను ఢీకొనడంతో ఆనంద్ అక్కడికక్కడే మృతిచెందగా తిమ్మప్ప,పూర్ణచంద్ర గాయపడ్డారు. గాయపడిన వారిని కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ఆనంద్ మృతిచెందడంతో ఆదివారం జరగాల్సిన తన సోదరి వివాహం ఆగిపోయింది.

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

కల్లూరు మే 18(ఆంధ్రజ్యోతి): పాతికేళ్ల తర్వాత ఆ విద్యార్థులు ఒక్కసారి కలుసుకొని నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అలనాటి చిలిపి చేష్టలనే కాదు, చదువులో పరస్పరం అందించిన సహకారాన్ని గుర్తు చేసుకున్నారు. ఆదివారం కల్లూరు మండలం, పెద్దపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనానికి వేదికైంది. ఈ పాఠశాల్లో 1999-2000 మధ్య పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు కలుసుకొని ఆనందోత్సాహాలతో గడిపారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు శేషఫణి శర్మ, సావిత్రమ్మ, కృష్ణారెడ్డి, ప్రభావతమ్మ, టీవీఎల్ పద్మను పిలిపించుకొని వారిని శాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. చిన్ననాటి స్నేహితులందరూ కలిసి విందు భోజనాలు చేశారు. మళ్లీ వచ్చే ఏడాది కూడా తప్పకుండా పరస్పరం కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. పూర్వ విద్యార్థులు గాండ్ల శివనాగరాజు, దామోదర్ రెడ్డి, రాముడు, జాఫర్, సత్యసాయి, మద్దిలేటి, రాజన్న, వెంకటేశ్వర్లు, లోకేష్, రవి, శ్రీనివాసులు, సిశ్రీను, అశోక్ పాల్గొన్నారు.



పెద్దపాడు జడ్పీ పాఠశాలలో కలుసుకున్న విద్యార్థులు

నేడు వేంకటేశ్వర స్వామి కల్యాణం

చాగలమర్రి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వేద పండితులు కైప నరసింహశాస్త్రీ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం ఉంటుందన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

22న అభయాంజనేయస్వామి జయంతి

మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామ రహదారిలోగల అభయాంజనేయస్వామి జయంతి మహోత్సవం 22న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. హనుమాన్ పతాకావిష్కరణ పంచామృతాభిషేకం, హోమాలు వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కోలాటం, భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామని తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

బేతంచెర్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు(40) అనే రైతు చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. రుద్రవరం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే రైతు తనకున్న 8 ఎకరాల పొలంలో వ్యవసాయం సాగు చేసేవాడు. కుటుంబ, వ్యసా యానికి ఇతరుల వద్ద రూ.19.50 లక్షలు అప్పు చేశాడు. పంటలు సరిగ్గా పండక, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపా నికి గురై ఈ నెల 15న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య శాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

ప్యాపిలి, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 1996-97 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. బెంగళూరు, హైదరాబాద్ వివిధ ప్రాంతాల్లో, ఆయా వృత్తులలో స్థిరపడిన దాదాపు 50 మందిపైగా పూర్వ విద్యార్థులు సమావేశానికి హాజరయ్యారు. దాదాపు 30 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో స్నేహితుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ పరవసించిపోయారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఖాజాపీర్, చిన్నసుంకయ్య, రామాంజినేయులు, రమేష్‌నాయుడు, సంజీవరెడ్డి, చెన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకులు

రుద్రవరం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాసాపురం దేవాలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణం కమనీయంగా సాగింది. ప్రధాన అర్చకులు వారణాసి గోపిశర్మ, శివశర్మల ఆధ్వర్యంలో స్వామివార్ల కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాగా, దేవాలయం ఆవరణంలో కోలాటం బృందం చేసిన నృత్యాలు భక్తు లను ఎంతగానో ఆకట్టుకుంది. దైవ సన్నిధిలో భక్తి గీతాలకు కోలాటం ఆడారు.

22న హనుమాన్ శోభాయాత్ర

కొలిమిగుండ్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 22న హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రను ధార్మిక సంఘాలు విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్ సభ్యుడు చంద్రశేఖరరెడ్డి కోరారు. ఆదివారం స్థానిక షిర్డీ సాయి మందిరంలో శోభాయాత్రపై సమరసత, హిందూ సంఘాలు, ఆర్ఎస్ఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. హిందూ సోదరుల శోభాయాత్రలో పాల్గొని ఐక్యత చాటాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి

కొలిమిగుండ్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): రహదారుల్లో వాహనాల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా వాహనచోదకులు రోడ్డు ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చిన్నపాటి అజాగ్రత్త, నిర్లక్ష్యం కారణంగా ఎంతో వి లువైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు. అలాగే మండలంలోని రౌడీషీటర్లకు సీఐ ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. పాత నేరస్థులు తమ పంథాను మార్చుకొని, శాంతియుత జీవనం కొనసాగించాలని సూచించారు.

నేడు ఆళ్లగడ్డలో మహానాడు

ఆళ్లగడ్డ, మే 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు నియోజక వర్గ స్థాయి మహానాడు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. పలు అంశాలను చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తిరంగా ర్యాలీ ఉంటుందన్నారు. మండలాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బనగానపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి) : లారీ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. బనగానపల్లె మండలం హుశేనాపురం గ్రామ సమీపంలో ఈఘటన చోటుచేసుకున్నట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. వివరాలు.. బనగానపల్లెకు చెందిన గౌతమ్‌గౌడు(21) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం అతడు లారీలో వెళ్తుండగా హుశేనాపురం సమీపంలోకి అతారీ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. గౌతంగౌడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు నందివర్గం ఎస్ఐ తెలిపారు.

ఎయిడ్స్ బాధితుల్లో ఆత్మస్థైర్యం నింపాలి

ఆళ్లగడ్డ, మే 18(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ బాధితుల్లో ఆత్మస్థైర్యం నింపాలని చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ వర్ధనాచారి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ బాధిత స్మారక దినం సందర్భంగా ఆదివారం ఆళ్లగడ్డ లోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు వైద్యుల సూచనలు పాటిస్తూ సరైన పౌష్టికాహారాన్ని తీసుకున్నట్లయితే జీవితకాలాన్ని పెంచుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ దేవకుమారి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి విగ్రహ ప్రతిష్ఠ

● ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రముఖులు ● తరలివచ్చిన చుట్టుపక్కల గ్రామాల ప్రజలు



శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



స్వామివారికి పూజలు చేస్తున్న సుబ్బారెడ్డి



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి బుగ్గన

డోన్ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెంకటనాయునిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరాములోరి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు పెద్దఎత్తున ఉత్సవాలకు తరలివచ్చారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరిగిన మహోత్సవ కార్యక్రమాలు ఆదివారం ధ్వజస్తంభం, రాముల వారి విగ్రహం ప్రతిష్ఠతో ఉత్సవాలతో వైభవంగా ముగిశాయి.

కోట్ల సుజాతమ్మ ప్రత్యేక పూజలు

శ్రీరాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ హా జరయ్యారు. గ్రామపెద్దలు కోట్ల సుజాతమ్మను ఆహ్వానించారు. స్వామివారికి కోట్ల సుజాతమ్మ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, టీడీపీ మండల కార్యదర్శి శ్రీనివాసులు యాదవ్, సీలం భాస్కర్ నాయుడు, గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు, భక్తులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి సన్నిధిలో సుబ్బారెడ్డి

గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు శ్రీరాముల వారి విగ్రహ ప్రతిష్ఠలో రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో స్వామివా రికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

శ్రీరాముల వారి ఆలయంలో..

డోన్ టౌన్: సీతారాముల వారి ఆలయాన్ని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం బుగ్గన స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు అర్చకులు మాజీ మంత్రికి ఘన స్వాగతం పలికారు. అలాగే డాక్టర్ సుంకన్న ఆహ్వానం మేరకు డోన్‌లో ప్రారంభం కానున్న యశోద ఆసుపత్రిని మాజీ మంత్రి బుగ్గన సందర్శించారు. అనంతరం రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. అనంతరం డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామంలో కృష్ణారెడ్డి (డీకేఆర్) ఆహ్వానం మేరకు వారి నివాసానికి వెళ్లారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, జడ్పీటీసీ రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, నాయకులు శ్రీరాములు, మల్లికార్జునరెడ్డి, సోమేష్ యాదవ్, మార్కెట్ యార్డు చైర్మన్ రామచంద్రుడు, నాగభూషణం రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

దస్తగిరిస్వామి దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు



దర్గాలో ప్రార్థన చేస్తున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

చాగలమర్రి, మే 18 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కట్టమీది దస్తగిరిస్వామి దర్గాలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉరుసు సందర్భంగా ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామానికి ఎమ్మెల్యే రాగానే టీడీపీ నాయకులు, కమిటీ సభ్యులు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దస్తగిరిస్వామికి ప్రత్యేక ఫాతెహాలు చేశారు. రాతిదూలం పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 12 జతల వృషభాలు పాల్గొన్నాయి. గెలుపొందిన వృషభాలకు నగదును దాతలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్సర్‌బాషా, కొలిమి ఉసేన్‌వలి, మాబుషరీఫ్, మౌలాలి, అనిఫ్, సల్లానాగరాజు, గుత్తి నరసింహులు, లక్ష్మీనారాయణగౌడ్, టైలర్ ఖాదర్, రాజేంద్ర, ఉసేన్‌పీరా, అస్రఫ్, ఖలీల్, బషీర్, గఫార్, నాగూర్‌వలి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

చాగలమర్రిలో టీడీపీ నాయకుడు జెట్టి నాగరాజు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పరామర్శించారు. రోడ్డు ప్రమాద సంఘటన గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం నుంచి కోలుకోవాలని, అవసరమైతే ప్రత్యేక చికిత్సలు చేయించుకోవాలన్నారు. నాయకులు జెట్టి సుధాకర్, సురేష్, సాయి, బాలుడు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లను పునరుద్ధరించాలి



విద్యుత్ లైన్ల పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాలనీల్లో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ లైన్లను పునరుద్ధరించాలని రోడ్డు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని 1వ వార్డులో విద్యుత్‌లైన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ విద్యుత్‌లైన్లు అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రమాదాలు చోటుచేసుకొనే అవకాశం ఉంటుందన్నారు. వర్షాలు పడుతుండటంతో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. విద్యుత్‌లైన్ల వ్యవస్థ సక్రమంగా ఉండేలా సరి చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌లైన్ పోల్స్ పనులను పరిశీలించారు.

టీడీపీ శ్రేణులు మహానాడుకు సిద్ధం కావాలి

కొలిమిగుండ్ల: తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి మహానాడు కార్యక్రమానికి శ్రేణులు సిద్ధం కావాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో టీడీపీ రెండవసారి అధికారం చేపట్టిన తర్వాత నిర్వహించే మొదటి మహానాడు కావడంతో పార్టీ అధిష్టానం అత్యంత ప్రతిష్టాత్మకంగా కడప జిల్లాలో నిర్వహించనుందన్నారు. మహానాడుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణా తరగతులు

బేతంచెర్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల శాఖ గ్రంథాలయంలో సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు, గేమ్స్ నిర్వహించారు. ఇందులో గ్రంథాలయ అధికారి మధుశేఖర్ మాట్లాడుతూ గ్రంథాలయాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీచర్ కృష్ణప్రియ, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు.

రోగులకు అన్నదానం

డోన్ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం రోగులకు మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన రవి కూతురు రఫ్ జాయ్ పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో జానీ ప్రభాకర్, ఆశీర్వాదం, స్థానికులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన ఎన్టీఆర్ అభిమానులు

డోన్ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత ఎస్‌కేపీ హై స్కూల్‌లో సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ వాల్మీకి బోయ సంఘం స్టేట్ ప్రొఫెషనల్ వింగ్ ప్రెసిడెంటు సురేష్ ఆధ్వర్యంలో అభిమానులు రక్తదానం చేశారు. వారికి సర్టిఫికెట్లు, పండ్లు అందజేశారు. తలసిమియా పిల్లల కోసం రక్తం సేకరించినట్లు సురేష్ తెలిపారు. కార్యక్రమంలో అభిమానులు గౌరీశ్వర్ నాయుడు, సుబ్బయ్య, సతీష్ కుమార్, ఉపేంద్ర నాయుడు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఈ శ్రమ కార్డుతో రూ.2 లక్షల బీమా

ప్యాపిలి, మే 18 (ఆంధ్రజ్యోతి): ఈ శ్రమకార్డుతో కార్మికులకు రూ. రెండు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని సీఐటీయూ మండల కార్యదర్శి చిన్నరహిమాన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 10లక్షల మంది అసంఘటిత కార్మికులు ఉన్నారన్నారు. ఇందులో ఇప్పటి వరకు ఆరులక్షల మంది ఈ శ్రమ కార్డులు చేయించుకున్నారన్నారు. కార్మికులందరు తప్పని సరిగా ఈ శ్రమ కార్డు తీసుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

ప్యాపిలి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు ఎంఈవో వెంకటేశ్వరనాయక్ తెలిపారు. ఆదివారం ఎమ్మార్సీ కార్యలయంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. 144సెక్షన్ అమలు చేశారని ఎంఈవో తెలిపారు.

నేడు మాన్యం కౌలుకు వేలం

శిరివెళ్ల, మే 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు గ్రూపు దేవాలయాల పరిధిలోని వివిధ ఆలయాలకు చెందిన భూములకు సోమవారం బహిరంగ కౌలువేలం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి రామాంజనేయ శర్మ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం కోటపాడులో, సాయంత్రం చెన్నూరు గ్రామంలో కౌలు వేలం నిర్వహిస్తు న్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని ఈవో సూచించారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

ఆళ్లగడ్డ, మే 18(ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ యుగంధర్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని చింతకుంట గ్రామంలో ప్రజలకు పలు అంశాలపై సీఐ అవగాహన కల్పించారు. ఫ్యాక్షన్ వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ప్రతి ఒకరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నగీనా, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎంపీ బైరెడ్డి శబరితో మాట్లాడుతున్న జనసేన నాయకులు

శిరివెళ్ల, మే 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై శిరివెళ్ల మెట్ట వద్ద శిరివెళ్ల మండల జనసేన నాయకులు ఎంపీ బైరెడ్డి శబరిని ఆదివారం కలిశారు. మండల కేంద్రంలో ప్రధానమైన సమస్యలను వారు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల కన్వీనర్ పసుల నరేంద్ర యాదవ్, పెనరాయి చాంద్‌బాషా, తలారి పెద్ద బాలయ్య, పటాన్ ఇంబ్రహీం ఖాన్, నాగరాజు శెట్టి, విజయసింహారెడ్డి, ఓబుళకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న వేద పండితులు

చాగలమర్రి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో ఈనెల 8 నుంచి ప్రారంభమైన చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఆలయాల బ్రహ్మోత్సవాలు ఆదివారం ధ్వజారోహనం, పూర్ణాహంతి హోమాలతో ఉత్సవాలు ముగిశాయి. వేద పండితులు శేషాచార్యులు, మాధవాచార్యుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి, చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, సంప్రోక్షణ పూజలు చేశారు. చెన్నకేశవ ఉత్సవ మూర్తులకు పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఈవో రమణ, ఆలయ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

యూనియన్ అభివృద్ధికి ఎనలేని కృషి

● ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

చాగలమర్రి, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా హెచ్‌ఎం ప్రసాద్ యూనియన్ సంఘ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సా యి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బాలుర ఉన్నత పాఠశాలలో ప్రసాద్ సంస్మరణ సభ ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మౌలాలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్‌రెడ్డి, అదనపు కార్యదర్శులు రమణారెడ్డి, శివశంఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అజామ్‌బేగ్, నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేయొద్దు

కోవెలకుంట్ల: సంస్కరణల పేరుతో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయిశ్రీనివాస్, వల్లూరు రఘునాథరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో నాయకులు జీవీ శివప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నంద్యాల జిల్లా అధ్యక్షులు మౌలాలి, అజిల్‌బేగ్, విలియం బాషా, వై.వెంకటరామిరెడ్డి, సుబ్బయ్య, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, శ్రీరామమూర్తి, ఓబులేసు, రవికుమార్ పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయండి

కోవెలకుంట్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రిష్ణతేజ ఫంక్షన్ హాలులో సోమవారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ యువ నాయకులు, కోవెలకుంట్ల సింగిల్ విండో మాజీ స ర్పంచ్ గువ్వల సుబ్బారెడ్డి అన్నారు. ఈ నెల 27, 28, 29 ఉమ్మడి కడప జిల్లాలో మహానాడు నిర్వహిస్తున్నారని, ఆ కార్యక్రమానికి బనగానపల్లె నియోజకవర్గంలోని అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల, బనగానపల్లె మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఏఎన్‌ఎంలను తక్షణమే బదిలీ చేయాలి



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కోవెలకుంట్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): సుదూర ప్రాంతాల్లో పని చేస్తున్న ఏఎన్‌ఎంలకు కౌన్సెలింగ్ చేసి వారిని తక్షణమే బదిలీ చేయాలని ఆరోగ్య కార్యకర్తల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు వీకేఎస్ జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎన్జీవో గృహంలో నంద్యాల జిల్లా ఆరోగ్య కార్యకర్తలతో ఆమె స మావేశం నిర్వహించారు. ముందుగా నంద్యాల జిల్లా నూతన కా ర్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నంద్యాలజిల్లా అధ్యక్షురాలిగా ఎ.షైమున్, సెక్రటరీగా దేవకృప, ప్రెసిడెంటుగా లక్ష్మి, వైస్ ప్రెసిడెంటుగా వి.లక్ష్మీదేవి, సుజాత, ఎస్.మాధవీ, చాముండేశ్వరి, లక్ష్మీదేవి, ట్రెజరర్లుగా సుమిత, ప్రమీల, ధనలక్ష్మి, ఆశీర్వాదమ్మ, శారద, సరోజిని, నాగకుమారిని ఎంపిక చేశారు. అనంతరం జయలక్ష్మి మాట్లాడుతూ స్థానికంగా ఎఎన్‌ఎంలు ఎఫ్ఆర్ఎస్‌తో చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఎఫ్ఆర్ఎస్ తీసివేయాల్సిందిగా కోరారు.

వెలగటూరులో గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ



గంగమ్మకు పూజలు చేస్తున్న టీడీపీ నాయకుడు ధనుంజయుడు

కోవెలకుంట్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగటూరులో గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో టీడీపీ నాయకుడు ధనుంజయుడు ఆధ్వర్యంలో దాతల సహకారంతో నూతన గంగమ్మ ఆలయం నిర్మించారు. వేద పండితులు ప్రత్యేక హోమాలు చేసి గంగమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మనోహర్, శ్రీనివాసులు, తిమ్మరాజు పాల్గొన్నారు.

తురాయి.. ఎంత హాయి

చాగలమర్రి/కొలిమిగుండ్ల/రుద్రవరం, మే 18 (ఆంధ్రజ్యోతి): తురాయి చెట్లకు వేసవిలో గుబురుగా పూలు పూస్తాయి. చాగలమర్రి, కొలిమిగుండ్ల, రుద్రవరం మండలాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న తురాయి చెట్లు ఎర్రటి పూలు విరబూసి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఎర్రటి పూలతో చెట్లన్నీ నిండుగా కనిపిస్తుండటంతో ఈ దారి గుండా ప్రయాణించేవారు చెట్లును చూసి ఆహ్లాదాన్ని పొందుతున్నారు.



చాగలమర్రి హైవేలో ఎర్రటి పూలు



కొలిమిగుండ్లలో..



రుద్రవరంలో..